
ప్రజాశక్తి
మంగళవారం 9 ఏప్రిల్ 2024 8 పేజీలు





తిరుపతి చిత్తూరు



ఎవరికి తీపో..ఎవరికి చేదో..!

తెలుగు సంవత్సరాది.. ఉగాది రానే వచ్చింది.. ఈ ఏడాది పొలిటికల్ ఉగాదిగా మారిపోయింది.. తీపి, చేదు, పులుపు, కారం, లవణం, వగరు వంటి షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని అందరం రుచి చూస్తాం.. అభ్యర్థులు సైతం పోటీపడి ఉగాది సంబరాల్లో పెద్దఎత్తున పాల్గొంటారు.. కార్యకర్తలతో కలిసి సాంప్రదాయబద్ధంగా సంబరాలు జరుపుకుంటారు.. అయితే మే 13న జరగనున్న ఎన్నికల్లో ఏ అభ్యర్థికి తీపి మిగులుతుందో, ఎవరికి చేదు మిగులుతుందో బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం అవుతుంది.. కౌంటింగ్ రోజు తేటతెల్లమవుతుంది.. ఏది ఏమైనా ఈ ఏడాది పొలిటికల్ ఉగాదిలో లోకల్, నాన్ లోకల్, గ్రూప్ రాజకీయాలు, వలసలు, ఇండిపెండెంట్లు, సామాజిక తరగతి ఓట్లు పెద్దఎత్తున ప్రభావం చూపనున్నాయి. ఎన్నికలపుడే కాకుండా ఎపుడూ ప్రజల సంక్షేమం కోరే వామపక్షాలకు ఈ ఎన్నికల ఉగాది షడ్రుచులనూ పంచనుంది.



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో త్రిముఖ పోటీ నెలకొంది.. కొన్నిచోట్ల పంటికింద రాయిలా ఇండిపెండెంట్లు గట్టిగానే పోటీ ఇచ్చే అవకాశం లేకపోలేదు. టిడిపి- జనసేన - బిజెపి కూటమిలో లోకల్, నాన్ లోకల్ పెద్ద ఇష్యూగా నడిచి, అందరూ సర్దుకున్నట్లే కనిపించినా లోపల లోపల ఎవరిని ఎవరు దెబ్బ తీసుకుంటారో ఎన్నికల తరువాత విశ్లేషణలో అర్ధమవుతుంది. ఈ ప్రభావం తిరుపతి, సత్యవేడు, వెంకటగిరిల్లో ఎక్కువగా కనిపించనుంది. వైసిపిలో నెలకొన్న గ్రూప్ రాజకీయాలు ఆ పార్టీకి తలనొప్పిగానే మారనున్నాయి. ఇక చిత్తూరు ఎంపిగా దుగ్గిమళ్ల ప్రసాద్ బాపట్ల నుంచి వలసొచ్చారు. అతనికి టిడిపి కంచుకోటగా ఉన్న నియోజకవర్గాలు తీపి కానున్నాయి. చంద్రగిరి ఎంఎల్ఎగా ఉన్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒంగోలు ఎంపిగా వైసిపి తరపునే వలసెళ్లారు. అయితే అక్కడ టిడిపికి వలసొచ్చిన 'మాగుంట' దెబ్బకు నిలబడతారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే. తిరుపతి ఎంపి కూడా ఓ రకంగా వైసిపి మధ్యే పోటీ అని చెప్పాలి. సిట్టింగ్ ఎంపి ఎం.గురుమూర్తి, గూడూరు సిట్టింగ్ ఎంఎల్ఎ వరప్రసాద్ మధ్యే. వరప్రసాద్ బిజెపి తీర్థం పుచ్చుకుని తెరపైకి వచ్చారు. రిజర్వుడు నియోజకవర్గాలైన సత్యవేడు, గూడూరు, సూళ్లూరుపేట, జీడీనెల్లూరు, పూతలపట్టుల్లో 'బ్యాక్‌గ్రౌండ్' ఏ వ్యాపారవేత్త చక్రం తిప్పుతున్నారో మరి. మంత్రి ఆర్‌కె రోజా, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిలకు గ్రూపుల బెడద 'చేదే'. తిరుపతి, సత్యవేడుల్లో వలసలు 'వగరు' కానుంది. ఇక నూతనంగా తెరపైకి వచ్చిన వారసులు జీడీనెల్లూరు, వెంకటగిరి, సూళ్లూరుపేటల్లో ఉన్నారు. వీరి అరంగేట్రం ఎన్నికల్లో విజయాన్ని వరిస్తారా, లేక 'లవణం'లా కరిగిపోతారో వేచి చూడాల్సిందే. ఇక కుప్పం విషయానికి వస్తే మెజార్టీ అనేది టిడిపికి తీపో, కారమో మరి. చంద్రబాబుకు ఈ ఉగాది ఎంఎల్ఎగానే పరిమితం చేస్తుందో, రాష్ట్రానికి సిఎంను చేస్తుందో ఓటర్లకే వదిలేద్దాం. వైసిపిలో పెద్దాయనగా పిలిపించుకునే పెద్దిరెడ్డికి పంటికింద రాయిలా భారత చైతన్య యువజన పార్టీ వ్యవస్థాపకులు రామచంద్రయాదవ్ ఇండిపెండెంట్‌గా పోరు తప్పేలా లేదు. ఏదిఏమైనా పొలిటికల్ ఉగాది నిండా 'సంక్షేమమే' నిండిపోయి 'స్థానిక' సమస్యలన్నీ పక్కదారి పట్టాయన్నది అభ్యర్థుల ప్రచార శైలిని బట్టి అర్ధమవుతుంది. బిజెపి వ్యతిరేక శక్తులకు దూరంగా, ప్రజా సమస్యలే ఆయుధంగా ఎప్పటికీ పోరుబాటలోనే ఉండే వామపక్షాలకు ఓటర్లలో మంచి ఆదరణే కనిపిస్తున్నా, పొలిటికల్ 'ఉగాది'లో ప్రత్యామ్నాయంగా నిలుస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే. గత ఏడాది ఉగాది మాత్రం బిజెపి, టిడిపి, వైసిపి, జనసేన రాజకీయ చదరంగంలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులకు 'చేదు'నే మిగిల్చింది.

అసత్యాలు...అసమానతలు..!

ప్రజాశక్తి - తిరుపతి సిటి

'అసత్యాలు, అసమానతల నడమ దేశం నలిగిపోతుంది' అని వక్తలు విశ్లేషించారు. వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సంబంధిత భవనంలో 'దేశం నిజంగా వెలిగిపోతోందా' అనే అంశంపై శాసనమండలి మాజీ ప్రొటీమ్ స్పీకర్ విఠపు బాలసుబ్రమణ్యం అధ్యక్షతన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ హాజరై ప్రసంగించారు. దేశం ఆర్థికంగా కుంగిపోతుంటే, పాలకులు పైకి వెలిగిపోతుందని అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. కర్నాటక ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోడీ మాట్లాడుతూ ప్రతిపక్షాలు తనను 99 సార్లు తిట్టాయని లెక్కలు చెప్పారని, అయితే దేశంలో నిరుద్యోగం ఎంత? కోవిడ్ మరణాలు ఎన్ని? వైద్యం అందక చనిపోతున్న వారి సంఖ్య ఎంత? వలసల రూపంలో సుదూర రాష్ట్రాలకు వెళుతున్న వారి సంఖ్య ఎంత? అనే లెక్కలు ఎందుకు చెప్పడం లేదన్నారు. చిన్నపాటి ఉద్యోగానికి నోటిఫికేషన్ వచ్చినా లక్షల్లో డిగ్రీ చేసిన వారి సైతం క్యూ కడుతున్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఆఖరికి చనిపోతామని తెలిసినా యుద్ధ ఉద్యోగాలకూ వెళుతుండటం నిరుద్యోగం ఏ స్థాయిలో ఉందో అర్ధమవుతుందన్నారు. దేశంలో రోడ్ల విస్తరణ వెలిగిపోతోందని, బిలియనీర్ల పెరుగుదలలో వెలిగిపోతోందని ఎద్దేవా చేశారు. దేశంలోని 22 శాతం సంపద ఒక శాతం ప్రజల్లో ఉంటే, 40శాతం ఆస్తులు ఒక శాతం ప్రజల చేతుల్లో ఉన్నాయన్నారు. అసమానతలు రోజురోజుకూ పెరుగుతుంటే, అసత్యప్రచారం చేయడం శోచనీయమన్నారు. సాక్షాత్తు ఆర్థికసంఘం నిపుణులు సైతం అసమానతలు మంచివేగా, బాగా సంపాదించినవారు పెట్టుబడులు పెడతారు అని వ్యంగ్యంగా మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రాల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. ఏకంగా తమ రాష్ట్రాలకు రావాల్సిన నిధులు విడుదల చేయాలని ఏకంగా ముఖ్యమంత్రులే దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలు చేసే పరిస్థితి నెలకొందన్నారు. కార్పొరేట్ శక్తులకు లక్షల కోట్ల రుణాలు మాఫీ, రాయితీలు, పన్నుల్లో సబ్సిడీలు ఇస్తున్నారని, పేదలకు మాత్రం ఏడాదికి అదనంగా మూడు సిలిండర్లు ఇస్తే సరిపోతుందని చెబుతున్నారన్నారు. విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల్లోని వాస్తవాలను సమాజానికి చెప్పడం మేధావుల బాధ్యతన్నారు. గత పదేళ్లలో దేశంలో అసత్య చర్చ ఎక్కువయ్యిందన్నారు. చివరికి దేశానికి స్వాతంత్ర్యం 2014లోనే వచ్చిందని చెప్పినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. సీనియర్ పాత్రికేయులు రాఘవశర్మ మాట్లాడుతూ దేశంలో ఎమర్జన్సీ కంటే దారుణ పరిస్థితులు ఉన్నాయన్నారు. గత పదేళ్లలో అణచివేత ధోరణి ఎక్కువయ్యిందన్నారు. ప్రశ్నించే గొంతులను నులిమేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షులు హేమచంద్ర, ప్రముఖ న్యాయవాది ఓంప్రకాష్, వేమన విజ్ఞాన కేంద్రం గౌరవాధ్యక్షులు టెంకాయల దామోదరం పాల్గొన్నారు.

'దేశం నిజంగా వెలిగిపోతుందా' సదస్సులో వక్తలు



సదస్సులో విఠపు బాలసుబ్రమణ్యం, పరకాల ప్రభాకర్

ఐఎఎస్ గిరీషాపై సస్పెన్షన్ ఎత్తివేత 2 లో

టిటిడి తిరుపతి జేఈఓగా గౌతమి 2 లో

ప్రశాంతంగా..పారదర్శకంగా..
మీడియాతో కలెక్టర్, ఎస్‌పి 2 లో



డంపింగ్‌యార్డులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్



చిత్తూరు నగరపాలక సంస్థ డంపింగ్‌యార్డులో సోమవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన డంపింగ్‌యార్డు చేరుకుని మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న కమిషనర్ డాక్టర్ జె.అరుణ హుటాహుటిన డంపింగ్‌యార్డు చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికి సమాచారం అందించారు. పొగ కారణంగా పరిసరాల్లో ఇబ్బందులు పడకుండా ప్రజలను అప్రమత్తం చేశారు. రెండు అగ్నిమాపక యంత్రాలు, నగక పాలక సంస్థ వాటర్ ట్యాంకర్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఇన్‌ఛార్జి ఎంహెచ్‌ఒ చిన్నయ్య, డిఇ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎఇలు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. మంటలు వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకున్నారు.

కారకులపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

చిత్తూరు ఓబుల్ పల్లి డంపింగ్ యార్డ్‌లో సోమవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది.సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, ఉపాధ్యక్షులు వాడా గంగరాజు స్పందిస్తూ ఈ ఘటనపై కమిషనర్ సమగ్ర విచారణ జరిపి, కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డులో పనిచేస్తున్న సుబ్రమణ్యంకు రక్షణ కల్పించి, ఉపాధి కొనసాగించాలన్నారు. డంపింగ్‌యార్డుకు నిప్పుపెట్టిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల కార్మికులు స్వచ్ఛందంగా సిఐటియు అనుబంధ సంఘాన్ని ఏర్పాటు చేసుకోవడాన్ని జీర్ణించుకోలేకనే దుష్టశక్తులు ఈ చర్యకు పాల్పడ్డాయని మండిపడ్డారు. డంపింగ్‌యార్డు సిబ్బందిపై అనుమానాలు రేకెత్తించే నీచాతి నీచమైన చర్యలకు ఒడిగట్టిన అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రశాంతంగా..పారదర్శకంగా..

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు చర్యలు / మీడియాతో కలెక్టర్, ఎస్పి

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ మేరకు సార్వత్రిక ఎన్నికలు 2024 ను జిల్లా లో ప్రశాంత వాతావరణం లో నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం పూర్తిగా సన్నద్ధంగా ఉందని, జిల్లాలోని ఓటర్లందరూ తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్, ఎస్పి కృష్ణకాంత్ పటేల్ పేర్కొన్నారు. ఎన్నికల సన్నద్ధత, నిర్వహణపై 'మీడియా'కు వివరించారు.

ముఖ్యంగా ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఎలాంటి విధులను సచివాలయ పరిధిలోని వాలంటీర్లను అప్పజెప్పడం లేదన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు చేసిన 18 మంది వాలంటీర్లను, ఒక రేషన్ డీలర్ ను, ప్రభుత్వ ఉద్యోగులు 5 మందిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకున్నామన్నారు.

సివిజిల్ యాప్ మోడల్ కోడ్ ప్రవర్తనా నియమావళి, వ్యయ ఉల్లంఘనలు, ఇతర ఏవైనా ఉల్లంఘనలను నివేదించడానికి పౌరులను అనుమతిస్తుందని, వీటిని ఎప్పటికప్పుడు 100 నిమిషాల్లో పరిష్కరించడం జరుగుతోందని, అందులో జిల్లాలో 510 నమోదు కాగా 390 పరిష్కరించామన్నారు. 120 డ్రాప్ చేయడం జరిగిందనీ తెలిపారు. సువిధ యాప్ ద్వారా అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ర్యాలీలు, సమావేశాల అనుమతులను సకాలంలో అందిస్తున్నామన్నారు. రాజకీయ పార్టీలు కేంద్ర ఎన్నికల సంఘం విధించిన మేరకు ప్రతి ఒక్కరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి)ని తప్పనిసరిగా పాటించాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, జి.ఎం స్మార్ట్ సిటీ చంద్రమౌళి, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు చెన్నయ్య, చరణ్ రుద్రరాజు, సూర్య నారాయణ, ప్రసాద రావు, మురళీకష్ణ, వివిధ ఎన్నికల బందాల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ : ఏప్రిల్ 18
నామినేషన్ల స్వీకరణ చివరి తేది : ఏప్రిల్ 25
నామినేషన్ల పరిశీలన : ఏప్రిల్ 26
నామినేషన్ల ఉపసంహరణ : ఏప్రిల్ 29
పోలింగ్ తేదీ : మే 13
కౌంటింగ్ తేదీ : జూన్ 4
అసెంబ్లీ నియోజకవర్గాలు : 7
పార్లమెంటరీ నియోజకవర్గం: 1
మొత్తం ఓటర్ల సంఖ్య ఏప్రిల్7 నాటికి : 18,03,211
పురుషులు : 8,78,708
స్త్రీలు : 9,24,321
థర్డ్ జెండర్ : 182
విభిన్న ప్రతిభావంతులు : 24,545
85 ఏళ్లు పైబడినవారు : 6,594
సహాయ అనుబంధ పోలింగ్ కేంద్రాలు : 2136.



ప్రభుత్వ భూమి కబ్జా

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి)

మండలంలోని ఇందిరమ్మ కాలనీలో లక్షలాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కాపాడాలని, ఆ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. చంద్రగిరి లోని ఇందిరమ్మ కాలనీలో విలువైన లక్షలాది రూపాయలు విలువ చేసే స్థలాన్ని అధికార పార్టీని అడ్డం పెట్టుకొని కొంతమంది దర్జాగా యంత్రాలతో చదును చేసి కబ్జా చేస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో సందులో సడేమియా అని, ఎవరూ పట్టించుకోరన్న ధీమాతో దర్జాగా కబ్జా చేయడాన్ని స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు.



స్వర్ణముఖి నదిలో విద్యార్థి గల్లంతు


ప్రజాశక్తి-నాయుడుపేట

నాయుడుపేట స్వర్ణముఖి నది లో విద్యార్థి గల్లంతు అయిన సంఘటన నాయుడుపేట బీడీ కాలనీ సమీపంలో చోటుచేసుకుంది. విద్యానగర్‌లో ఒక ప్రవేట్ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతున్న అఖిల్ (17) సోమవారం నాయుడుపేట లోతువానిగుంత వెనుకవైపు ఉన్న స్వర్ణముఖి నదిలో తన స్నేహితులతో కలిసి సరదాగా వెళ్లి నది లో ఈత కోసం దిగి గల్లంతు అయ్యాడు. తోటి స్నేహితులు గమనించి వెంటనే నదిలోకి దిగి అఖిల్ కోసం గాలించారు. సమాచారం అందుకున్న స్థానిక సీఐ శ్రీనివాసులు రెడ్డి ఘటన స్థలంకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. నదిలో స్థానికులు అఖిల్ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. చుట్టుపక్కల ఎల్ ఏ సాగరం, బీడీ కాలనీ, భూపయ్య కాలనీ వాసులు తో పాటు పట్టణం లో జనం భారీగా వచ్చి గుమిగూడారు.

శ్రీసిటీని సందర్శించిన ఎపిఎంఎస్ఎంఇ సిఇఒ

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

రాష్ట్ర ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ సీఈఓ ఆదర్శ్ రాజేంద్రన్ సోమవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్ కుమార్ ఆయనకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సహాయ సంచాలకులు రామమూర్తి పాల్గొన్నారు.



ఎన్‌హెచ్‌ఎం జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -తిరుపతి టౌన్



నేషనల్ హెల్త్ మిషన్ తిరుపతి జిల్లా నూతన కమిటీ ఎన్నికయ్యింది. తిరుపతి యశోదనగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రంలో జిల్లా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏపీ నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర జేఏసీ చైర్మన్ దయామణి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం హామీ మేరకు అర్హతకలిగిన ఎన్ హెచ్ ఎంలను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమానవేతనం అమలు చెయ్యాలని. ఈలోగా రాష్ట్ర అధికారులు ఇచ్చిన హామీ ప్రకారం వేతనాలు, అరియర్స్ చెల్లించాలని కోరారు. నూతన కమిటీ అభినందించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ రాష్ట్ర నాయకులు లోకేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. గౌరవాధ్యక్షులుగా గండికోట నాగ వెంకటేష్, అధ్యక్షులుగా ఎస్‌కె మొహిద్దీన్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ మోహన్‌కుమార్, డి.అల్విన్, పి.హేమకుమార్, ఎం.పద్మ, ప్రధాన కార్యదర్శిగా గద్వాల్ నారాయణమ్మ, సహాయ కార్యదర్శులుగా ఎస్.మహ్మద్, షఫి, వి.వేదవతి, ఎం.స్వరూప, కోశాధికారిగా వి.మధు ఎన్నికయ్యారు.

మెజార్టీ పెంపే లక్ష్యం కావాలి : ఆరణి



తిరుపతి టౌన్ : అక్రమ కేసులు పెట్టి ప్రతిపక్ష నేతలను భయపెట్టాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చూస్తోందని తెలుగుదేశం-బిజెపి బలపరుస్తున్న జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు ఆరోపించారు. ఓటమి భయంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కొంత మంది అధికారులను అడ్డంపెట్టుకుని గెలవాలని చూస్తోందని ఆయన విమర్శించారు. పెద్దకాపు వీధిలోని ఓ ప్రైవేట్ హోటల్లో తెలుగుదేశం పార్టీకి చెందిన 10, 11, 26, 27, 32 వార్డుల క్లస్టర్ ఇన్చార్జీ పులుగోరు మురళీ అధ్యక్షతన ఐదు వార్డుల అధ్యక్ష కార్యదర్శులు, యూనిట్ ఇన్చార్జీలతో ఆత్మీయ సమావేశం జరిగింది. అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ మూడు పార్టీల కార్యకర్తలు, నాయకులు కలసికట్టుగా సాగితే తిరుపతిలో జనసేన, బిజెపి జెండాలు ఎగరడం ఖాయమన్నారు. పొత్తులో భాగంగా టిడిపిక కంచుకోట అయిన తిరుపతిని జనసేనకు కేటాయించారని, గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి ఎంఎల్ఏగా తనను, పార్లమెంట్ అభ్యర్థిగా వరప్రసాద్‌ను గెలిపించాలన్నారు. తెలుగుదేశం పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు నరసింహ యాదవ్, ఆర్సీ మునికష్ణ, కంకణాల రజనీకాంత్ నాయుడు పాల్గొన్నారు.

టిటిడి తిరుపతి జేఈవోగా గౌతమి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



తిరుమల తిరుపతి దేవస్థానం విద్య వైద్య విభాగం జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ఎం గౌతమ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది. గతంలో జేఈవోగా పనిచేసిన సదా భార్గవి స్థానంలో ఈమెకి రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. చిత్తూరు జిల్లా వాసి అయిన ఈమె 2014 ఐఏఎస్ బ్యాచ్. జాయింట్ కలెక్టర్ గా పలు జిల్లాలో పనిచేశారు. అనంతపురం జిల్లా కలెక్టర్‌గానూ పనిచేశారు. ప్రస్తుతం ఎండోమెంట్ రెవెన్యూ భాగంలో కార్యదర్శిగా పనిచేస్తున్నారు. తిరుపతి జేఈఓగా బాధ్యతలు తీసుకోనున్నారు.

ఐఎఎస్ గిరీషాపై సస్పెన్షన్ ఎత్తివేత

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



లోక్‌సభ ఉప ఎన్నికల్లో ఓటర్ కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేసిన ఆరోపణలతో అప్పటి ఇఆర్ఒ పిఎస్ గిరీషా అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తుండగా ఈ ఏడాది జనవరిలో జాతీయ ఎన్నికల కమిషన్ సస్పెండ్ చేసింది. ఐఎఎస్ అధికారి గిరీషాపై సస్పెన్షన్ ఎత్తివేస్తూ, ఆరోపణలపై విచారణను పెండింగ్ ఉంచినట్లు జాతీయ ఎన్నికల కమిషన్ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కెఎస్ జవహర్‌రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. గిరీషాకు ఎన్నికల విధులు అప్పగించకుండా, ఇతర శాఖలో పోస్టింగ్ ఇవ్వాలని ఆదేశాల్లో పేర్కొంది.



ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వీసీకి ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వెంకటేశ్వర విద్యాలయంలో పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ అకడమిక్ కన్సల్టెట్ బి.వెంకటేశ్వర్లు రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వీసీకి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు అక్బర్ మాట్లాడుతూ వెంకటేశ్వర్‌రెడ్డి ఎస్ఎఫ్ఐని కించపరిచేలా మాట్లాడటమే కాకుండా, విద్యార్థిసంఘాల్లో ఇకపై పాల్గొనవద్దని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేశారన్నారు. 'రాజ్యాంగ విశిష్టత..ప్రస్తుత సవాళ్లు' అంశంపై సదస్సు నిర్వహించడాన్ని జీర్ణించుకోలేకనే ఈ విధమైన ఇబ్బందులకు గురిచేశారన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసేలా ఆయన చర్యలు ఉన్నాయన్నారు. వీసీకి వినతిపత్రం ఇచ్చిన వారిలో అశోక్, నరేంద్ర, వినోద్ పాల్గొన్నారు.

అవినీతి వైసిపి పార్టీని వీడాను : ఎంపి అభ్యర్థి వరప్రసాద్

ప్రజాశక్తి-నాయుడుపేట

రాష్ట్ర వ్యాప్తంగా జగన్ మోహన్ రెడ్డి పాలనలో అవినీతి, అక్రమాలతో పాటు ఆయనకు అహంకారం పెరిగిందని, వయస్సుకు కూడా గౌరవం ఇవ్వని వ్యక్తి అని తిరుపతి బిజెపి పార్లమెంట్ అభ్యర్థి వరప్రసాద్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నాయుడుపేట చంద్రబాబు కాలనీలో టీడీపి ఉమ్మడి ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీడీపి అభ్యర్థి నెలవల విజయ శ్రీ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం లో బడుగు బలహీనవర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని, కాలనీలలో అభివద్ధి ఎక్కడా జరగలేదని, ఒక మహిళ గా తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోనే సూళ్లూరుపేట నియోజకవర్గాన్ని అభివద్ధిలో మొదటి స్థానంలో నిలబెడతాన్నన్నారు. ఎంపి అభ్యర్థి వరప్రసాద్ మాట్లాడుతూ గతంలో తాను ఎంపీగా పని చేసిన అనుభవం వుందని కేంద్ర ప్రభుత్వం నిధులతో



మారుమూల గ్రామాలలో అని మౌళిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. కాలనీలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏ ఎం సి చైర్మన్ యస్ విజయభాస్కర్ రెడ్డి, జనసేన నేత ఉయ్యాల ప్రవీణ్ కుమార్, టీడీపి నేతలు ,786 రఫీ, కాందాటి కష్ణారెడ్డి, ఊగుమూడి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ లేఔట్‌లపై చర్యలు తప్పవు

-రెవెన్యూ అధికారుల హెచ్చరిక
- అక్రమ లేఔట్‌లో బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: అక్రమ లేఔట్‌లో పెళ్లకూరు రెవెన్యూ సిబ్బంది స్పందించారు. చర్యలు తప్పవని హెచ్చరిస్తూ సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలోని తాళ్లాయిపాడు గ్రామంలో సర్వే నంబర్ 68-1. లో1 ఎకరా 65 సెంట్లు భూమికి కన్వర్షన్ మాత్రమే పొంది ఎలాంటి అనుమతులు లేకుండా నదీ పరివాహక ప్రాంతం, ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని 2 ఎకరాల 50 సెంట్లు భూమిలో అక్రమ లేఅవుట్ నిర్మించారు. గ్రామ పంచాయతీకి ఇవ్వవలసిన 10 శాతం ల్యాండ్ ని ఇవ్వకుండా రియాల్టర్స్ ఒక్కో అంకణం 1లక్ష 30 వేలు నుండి 1,50,000 రూపాయలతో అమ్ముకొని గ్రామానికి నష్టం కలిగిస్తున్నారని స్థానికులు పలుమార్లు రెవెన్యూ అధికారులకు తెలపడంతో స్పందించిన రెవెన్యూ సిబ్బంది



సోమవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. సర్వే నంబర్ 74-3 లో0.11 సెంట్లు, 74-22 లో0.05 సెంట్లు, 74-21 లో0.03 సెంట్లు మొత్తం 19 సెంట్లు సీలింగ్ ల్యాండ్ (ప్రభుత్వ భూమి) ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేశారని, ఈ సర్వే నంబర్లు ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు త ప్ప వ ని, అతిక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు ఉంటాయని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్ బాబ్, వీఆర్వో కళ్యాణి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీనివాసులు తలారి పుట్టమ్మ పాల్గొన్నారు.

క్రైం న్యూస్

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- తవణంపల్లి: ఓ గుర్తు తెలీని వాహనం ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మండలంలోని కేజి సత్రం వద్ద చోటు చేసుకుంది. ఎస్సై మల్లికార్జున ఇచ్చిన సమాచారం మేరకు తవణం పల్లి మండలం కొత్తపల్లికి చెందిన పెద్దబ్బ కుమారుడు చిన్నబ్బా (57) కూలి పని కోసం కేజీ సత్రం వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా పలమనేరు నుంచి వేగంగా వస్తున్న గుర్తుతెలీని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నబ్బకు తీవ్రగాయాలు కాగా స్థానికులు 108 ద్వారా చిత్తూరుప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను మతి చెందాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పజెప్పారు. ఎస్ఐ కేసునీ దర్యాప్తు చేస్తున్నారు.



సిపిఎం నాయకుడు ఖాదర్‌బాయ్‌కి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సిపిఎం నాయకుడికి నివాళి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మండల కేంద్రమైన పిచ్చాటూరులో సీపీఎం నాయకుడు ఖాదర్ బాయ్ (70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం ఆయన భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ క్లస్టర్ ఇన్‌ఛార్జి డి ఇళంగోవ రెడ్డి, పద్మనాభం రాజు (పద్దు), నాయకులు హెండ్రీ, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: మండలంలోని నెరబైలు గ్రామ పంచాయతీ బీసీ కాలనీకి చెందిన మతి స్థిమితం లేని కాంత (45) సోమవారం పాము కాటుతో మృతి చెందినట్లు డాక్టర్ కష్ణ చైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి వద్ద చెట్టు కింద ఎండిన ఆకులు శుభ్రం చేస్తుండగా ఏదో కరిసినట్లు అనిపించిందని ఇంట్లోనే ఉండి సొంత వైద్యం చేసుకుంది. ఆమె కుటుంబ సభ్యులు ఇంటిలో ఎవరూ లేక పోవడంతో పరిస్థితి విషమించింది. స్థానికుల సాయంతో హుటాహుటిన స్థానిక ప్రాథమిక హాస్పిటల్ కి తీసుకెళ్లి చికిత్స అందించారు. పరిస్థితి మరింత విషమించడంతో 108 ద్వారా తిరుపతికి తరలించే లోపు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.



ముస్లింలకు సరుకులు అందిస్తున్న దాతలు

సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండో పట్టణంలోని మాలవ్య నగర్‌లో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో రంజాన్‌ను పురస్కరించుకొని 15 మంది పేద ముస్లింలకు రంజాన్ తోఫాను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా పొణకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు పొణకా మల్లికార్జున రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్ర శేఖర్ మాట్లాడుతూ దాతల సహకారంతో సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో , సెక్రెటరీ జి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు పిడి కరిముల్లా, వాచ్ షాప్ రాము, కుమార్ నాయుడు, పోతిరెడ్డి , పెంచలయ్య పాల్గొన్నారు.

'సెవెన్ హిల్స్'లో ఉగాది సంబరాలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని వెంకట్రామాపురంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో సోమవా రం ముందస్తు క్రోధి నామ సంవత్సర, తెలుగు నూతన సంవత్సరమైన ఉగాది వేడుక ల ను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో అరటి, మామిడి తోరణాలు, వివిధ పుష్పాలతో సంప్రదాయ బద్ధంగా అలంకరించారు. అనంతరం (ఆరు రకాలైన) షడ్రు చులతో కూడిన ఉగాది పచ్చడిని తయారుచేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించి జ్యోతిష్యులు విద్యార్థుల జాతక విశేషాలను తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం నిరంజన్ బాబు తెలు గు నూతన సంవత్స రం, ఉగాది ప్రత్యేక తలను విద్యార్థులకు తెలిపారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా విద్యార్థిని విద్యార్థులు సంప్రదాయ దుస్తుల ధరించి ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ ఎం సుమలత, బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని ఆనందోత్సాహాలతో ముంద స్తు ఉగాది సంబరాలు నిర్వహించారు.



ఉగాది వేడుకల్లో పాల్గొన్న సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు

ధనాశి ఉషారాణికి విశిష్ట ఉగాది పురస్కారం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: స్థానిక భాకరాపేటకు చెందిన రచయిత్రి, ఉపాధ్యాయురాలు ధనాశి ఉషారాణి విశిష్ట ఉగాది జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ధనాశి ఉషారాణి తీరుపతి శ్రీ శ్రీ కళావేదికలో ఉగాది కవి సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ కవి సమ్మేళనంలో ఉగాదిపై రచయిత్రి ఉషారాణి తన కవితా గానం మృదు మధురంగా ఆలపించి ప్రశంశలందుకున్నారు. ఇందుకు శ్రీ శ్రీ కళా వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా ఉషారాణిని ఆ కళా వేదిక జాతీయ కన్వీనర్ కత్తి మండ ప్రతాప్ నియమించారు. ఆ కళా వేదికలో జరిగిన జానపద స్వర గానంలో అనేక ప్రక్రియలను నూతనంగా రూపొందిస్తూ అనేక పుస్తక ముద్రణలతో సమాజానికి అందించారు. వారి సేవను గుర్తించిన ఆ కళావేదిక జాతీయ మహిళా కన్వీనర్ కొల్లి రమాదేవి, అధ్యక్షురాలు చిట్టే లలిత , రాష్ట్ర కార్యదర్శి అరవ జైపాల్ చేతుల మీదుగా విశిష్ట ఉగాది జాతీయ పురస్కారాన్ని అందించి సత్కరించారు. కళా వేదిక జాతీయ కమిటీ సభ్యులు హరి సర్వోత్తమ నాయుడు , తోటి రచయితలు వారికి అభినందనలు తెలిపారు.



రచయిత్రి ధనాశి ఉషారాణికి ఉగాది పురస్కారం అందిస్తున్న శ్రీశ్రీ కళావేదిక సభ్యులు

'ముదిరాజ్ లకు చట్ట సభల్లో అవకాశం కల్పించాలి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ముదిరాజ్ లకు చట్ట సభల్లో అవకాశం కల్పించాలని ఆ సంఘం నేతలు డిమాండు చేశారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శ్రీకాళహస్తిలో మహాసంకల్ప ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వందలాది మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘ అధ్యక్షులు వై వి రమణయ్య మాట్లాడుతూ... తమ సామాజిక వర్గాలను బీసీ-డి నుంచి బీసీ- ఏ గ్రూపులో చేర్చాలని ఆయన డిమాండు చేశారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం 20వేలకు పైగా ముదిరాజ్ జనాభా ఉన్నారన్నారు. ముదిరాజ్ లు రాజకీయంగా అణచివేతకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు తమను ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని ఇకనైనా ముదిరాజ్ కు జనాభా ప్రాతిపదికన రావలసిన ప్రత్యక్ష, నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించాలని ఆయన కోరారు. శ్రీకాళహస్తి, తిరుపతి పుణ్యక్షేత్రాల్లో ముదిరాజ్‌ల కోసం భవనం నిర్మించి ఇవ్వాలని ఆయన కోరారు. ఇక ముదిరాజులు తమ పిల్లలను ఉన్నత చదువులను చదివించాలని వ్యాపార రంగంలో అత్యంత శిఖరాలను చేరుకోవాలన్నారు. ముదిరాజులు ఐకమత్యంగా ఉండి ఒకరినొకరు సహకరించుకుని ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నారు. రానున్న రోజుల్లో ముదిరాజ్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఇక ముదిరాజ్ యువత అధ్యక్షులు ఆకుల గురుమూర్తి మాట్లాడుతూ ముదిరాజ్ యువత అన్ని రంగాలలో అభివృద్ధి సాధించాలనీ, ముఖ్యంగా విద్యారంగంలో నైపుణ్యతను ప్రదర్శించాలన్నారు. యువత చెడు అలవాటులకు బానిసలు కాకుండా మంచి మార్గంలో నడవాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కపిల్, కోశాధికారి గోవిందస్వామి, కోటేశ్వరరావు, ఆర్ సుబ్రహ్మణ్యం, కే ఈశ్వర్, అయ్యప్ప, పిల్లారి అమరావతి, నాగలక్ష్మి, ఆకుల సునీత, పద్మశ్రీ, లోకేష్, రాజా, సతీష్, నరేంద్ర, శీను, తిరుపాల్, బత్తినయ్య, చిన్న నాగరాజు, శ్రీను, మునిరాజా, పవన్, కోటి, వేణు, గురు, శేఖర్, దేశయ్య పాల్గొన్నారు.

రౌడీయిజం లేకుండా చేస్తాం..

-బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే శ్రీకాళహస్తిలో రౌడీయిజం లేకుండా చేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి పేర్కొన్నారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని 9, 10, 12వ వార్డుల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో పడుతున్న కష్టాలను ప్రజలు ఆయనకు వివరించారు. శ్రీకాళహస్తిలో రౌడీయిజం పెరిగి పోవడంతో స్వేచ్ఛగా జీవించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తే శ్రీకాళహస్తిలో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించే విధంగా చేస్తామన్నారు. గోపాలన్న పాలనలా శాంతిభద్రతలకు విఘాతం లేకుండా పాలన ఉంటుందన్నారు. ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. ఇక టీడీపీ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్, క్లస్టర్ ఇన్ ఛార్జి మిన్నల్ రవి, కాసరం రమేష్, కరీం, సుప్రజ, సీఎస్ మస్తాన్, మునీంద్ర, ఫకృద్దీన్, ఊహ, వివేక్, రాకేష్ పాల్గొన్నారు.


రాష్ట్రం విడిపోవడానికి కారకుడు కిరణ్ కుమార్ రెడ్డి

రిజర్వాయర్లను అడ్డుకున్న ఘనుడు బాబు

ఇద్దరికీ బుద్ధి చెప్పాలి: పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- సోమల

రాష్ట్ర విభజనకు ముఖ్యకారకుడు మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి, రిజర్వాయర్ల నిర్మాణాన్ని కోర్టుల ద్వారా అడ్డుకున్న వ్యక్తి చంద్రబాబు నాయుడు అని రానున్న ఎన్నికలలో వీరిద్దరికీ మండల ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పి వైసిపి గెలిపించాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కోరారు. సోమవారం మండలంలోని 15 పంచాయతీలలో ఆయన సుడిగాలి పర్యటన నిర్వహించారు. 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీలో ప్రారంభమైన మంత్రి పర్యటన పేటూరు, అన్నెమ్మగారిపల్లి, పెద్ద ఉప్పరపల్లి పంచాయతీలలో ప్రారంభమై మిగిలిన పంచాయతీలలో పర్యటన కొనసాగింది. పేటూరు గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి మూడున్నర సంవత్సరం సీఎంగా ఉండి రాష్ట్రం విడిపోవడానికి కారకులయ్యారని, రాజధాని లేకుండా చేశాడని అన్నారు. రైతుల ప్రజల సంక్షేమం కోసం తాగు, సాగునీరు అందించే లక్ష్యంతో మూడు రిజర్వాయర్లను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం కాగా కోర్టులకు వెళ్లి వాటి నిర్మాణాలు జరక్కుండా చంద్రబాబు నాయుడు అడ్డుకున్నాడని ఇలాంటి రైతు ద్రోహికి ఓట్లు వేసి గెలిపిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచి చెడ్డ ఆలోచించి మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్సిపి సీఎం జగన్మోహన్ ఆధ్వర్యంలో ఏర్పడే విధంగా ఎన్నికలలో అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తాను పుంగనూరు శాసనసభ్యుడుగా, మిధున్ రెడ్డి రాజంపేట పార్లమెంటు సభ్యులుగా ఈఎన్నికలలో నిలబడటం జరుగుతోందని ఇద్దరిని గెలిపించాలని కోరారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి


చెవిరెడ్డి పదేళ్ల పాలనలో చంద్రగిరి 20 ఏళ్లు వెనక్కి..

కూటమి నాయకుల ఆత్మీయ సమావేశంలో పులివర్తి నాని ఫైర్



ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): పదేళ్ల చెవిరెడ్డి పాలనలో చంద్రగిరి అభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందని, రెండు సార్లు ప్రజలను మభ్య పెట్టి, మోసం చేసి గెలిచాం.. ఈసారి ఓటర్లలో చైతన్యం వచ్చిందని భావించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి..చంద్రగిరిని వదిలి ఒంగోలుకు మకాం మార్చారని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని విమర్శించారు. చంద్రగిరిలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో కూటమి నాయకుల సమన్వయ కమిటీ ఆత్మీయ సమావేశం పులివర్తి నాని ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. చిన్నగొట్టిగల్లు మండల టిడిపి సీనియర్ నాయకులు జంగావాండ్ల పల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లాడుతూ మన నియోజక వర్గాన్ని దోపిడీ దారుల నుంచి రక్షించాలన్నారు. ఎమ్మెల్యే సహజ సంపదను దోచి, మఠం భూములు, ప్రభుత్వ భూములు కబ్జా చేసి రూ 5వేల కోట్లు వెనకేసుకున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే అవినీతి పై శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో సత్యప్రమాణానికి టీడిపి సీనియర్ నేత కుమార రాజా రెడ్డి పిలుపునిస్తే ఎమ్మెల్యే మొఖం చాటేశారన్నారు. దీన్ని పరిశీలిస్తే ఆయన అవినీతి బాగోతం అర్థమవుతుందన్నారు. సీనియర్లు ను గౌరవిస్తూ కొత్త వారిని ప్రోత్సహిస్తూ సమన్వయంతో ముందుకు సాగుతామని పిలుపునిచ్చారు. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు సి ఆర్ రాజన్, పాకాల జడ్పిటిసి నంగా పద్మజా రెడ్డి, జనసేన సమన్వయకర్త దేవర మనోహర్, కుమార్ రాజా రెడ్డి, నంగా బాబు రెడ్డి, రమేష్ రెడ్డి, శ్రీధర్ నాయుడు, ఈశ్వర్ రెడ్డి, ఎం తిరుమలరెడ్డి, వి సుబ్రహ్మణ్యం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించుకుందాం..



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: వచ్చే నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించుకుందామని పలువురు నేతలు పేర్కొన్నారు. పట్టణంలోని సరస్వతి ఆడిటోరియంలో సోమవారం కోలా ఆనంద్ ఆధ్వర్యంలో టీడీపీ, బీజేపీ నేతల పరిచయ ఽకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, తిరుపతి పార్లమెంటు అభ్యర్థి వెలగపల్లి వరప్రసాద్ తో పాటు పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ, బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఏపీలో వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అరాచక పాలనను సాగనంపాలన్నారు. శ్రీకాళహస్తిలో వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదనరెడ్డి అరాచకాలు పెరిగి పోయాయన్నారు. ఇలాంటి వ్యక్తికి ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని కోరారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిని, తిరుపతి ఎంపీగా వరప్రసాద్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షులు చంద్రప్ప, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కంద్రిగ ఉమ, మేళాగారం సుబ్రహ్మణ్యం రెడ్డి, చాగణం శైలజ, రంగినేని చెంచయ్య నాయుడు, మిన్నల్ రవి, వెంకటాచలం, కొన్నలి రమేష్, పేట బాలాజీ, మునిరత్నం, హరిబాబు, రవీంద్రనాథరెడ్డి, లక్కమనేని మధు, రవీంద్రబాబు, వినయ్, బీజేపీ మండల, జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ లో సీనియర్లకు అన్యాయం'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దశాబ్దాల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీలో సీనియర్లకు అన్యాయం జరుగుతోందని ఆ పార్టీ సీనియర్ నేత డాక్టర్ బత్తెయ్య నాయుడు విమర్శించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలుగా వైఎస్ షర్మిల నియమితులయ్యాక ప్రలోభాలకు లోనై సీనియర్లకు సీట్లను అమ్ముకున్నారని ఆరోపించారు. బత్తెయ్య నాయుడు సోమవారం స్థానిక పీపుల్స్ ఫోరం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శ్రీకాళహస్తిలో ఇండియా కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు టిక్కెట్టు రాకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. తాను కాంగ్రెస్ లోనే ఉంటాననీ, న్యాయ పోరాటం చేస్తానని స్పష్టం చేశారు.

వైసీపీలోకి చేరిక



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని 29,30వ వార్డులలో టిడిపికి చెందిన 150 మంది స్థానిక నాయకులు సలీం ఆధ్వర్యంలో సోమవారం టిడిపి నుండి వైసిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్, వైసిపి గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్ వైసిపి గూడూరు నియోజకవర్గ జేసియస్ ఇన్‌ఛార్జి చేవూరు విజయ్ మోహన్ రెడ్డి సమక్షంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వైసిపి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, జెసిఎస్ కన్వీనర్ రాఘవరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి కాంద్ర నారాయణరెడ్డి, చింతం రెడ్డి సురేష్ రెడ్డి , రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి పూర్ణచంద్ర, జలీల్ ఇతర వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థి ప్రచారం

ప్రజాశక్తి- తిరుపతి డెస్క్: నారాయణవనం హరి ఫంక్షన్ హాల్ లో టిడిప కూటమి నేతల క్రియాశీలక సమావేశం సోమవారం నిర్వహించారు. అధికారం దక్కించుకోవడానికి వైసిపిని సమిష్టిగా ఎదుర్కోవాలని పలువురు పిలుపు నిచ్చారు. వైసిపి అధికారం చేపడితే అభివృద్ధి వుండదని, పేదలకు అన్యాయం, బీసీలకు మొండి చేయి తప్పదని, ఈ విషయాన్ని ప్రజల్లోకి బాగా తీసుకు వెళ్లాలన్నారు.

వైసిపి నాయకుల ఎన్నికల ప్రచారం



ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: కేవిబి పురం మండలంలో వైసిపి సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూక తోటి రాజేష్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. సోమవారం కోటమంగాపురం మిద్ది కంద్రిగ, సదాశివపురం గ్రామాల్లో ప్రచారం చేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి తమకు అవకాశం ఇచ్చి జగన్మోహన్ రెడ్డిని మరొకసారి అవకాశం ఇవ్వాలని హిస్టరీ అకాడమీ డైరెక్టర్ గవర్ల కృష్ణయ్య ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి చెప్పిన హామీలు నెరవేర్చారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్యకర్తలు, అభిమానులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ప్రజాశక్తి- రామచంద్రాపురం (తిరుపతి రూరల్):

మండలంలోని గంగిరెడ్డి పల్లి పంచాయతీ, పద్మావళిపురం గ్రామానికి చెందిన గ్రామస్తులు ఎంపీపీ ఏవి బ్రహ్మానందరెడ్డి, సర్పంచ్ భారతి ల ఆధ్వర్యంలో చంద్రగిరి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సమక్షంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి నివాసంలో సోమవారం వైసీపీలో చేరారు. వారికి మోహిత్ రెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎంపీ గురుమూర్తి ప్రచారం

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలంలోని ఇసుక తాగేలి గ్రామంలో తిరుపతి పార్లమెంట్ ఎంపీ డాక్టర్ ఎం గురుమూర్తి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను వివరించి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఏర్పేడు మండల ఇన్‌ఛార్జ్ గున్నేరు కిషోర్ రెడ్డి, ఇసుక తాగేలి సర్పంచ్ కందాటి గురవమ్మ, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కూనాటి రమణ యాదవ్, పాత గుంట గురువా రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ నాగార్జున రెడ్డి, సీనియర్ నాయకుడు మహేష్, ఎంపీటీసీ ముని రెడ్డి పాల్గొన్నారు.

టిడిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చంద్రగిరి నియోజకవర్గం నుండి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పులివర్తి నానిని గెలిపించడానికి స్థానిక తిరుమల నగర్ టిడిపి కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం ప్రారంభించామని కమిటీ అధ్యక్షులు గోవిందరాజులు తెలిపారు. సోమవారం పంచాయతీ పరిధిలోని కోళ్ల ఫారం, హరిత కాలనీలలో టిడిపి నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, కమిటీ కార్యదర్శి చెన్నరాయప్ప, అజిస్ భాష, కృష్ణయ్య, సుధా, కరుణాకర్, శ్రీనివాసులు, ప్రభాకర్, భూషణం, రాంజీ, దేవేంద్ర, సదాశివం పాల్గొన్నారు.



'ఉపాధి' పనుల పరిశీలన



ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మండలంలోని ముత్తుకూరు గ్రామ పంచాయతీలలో జరుగుతున్న కాలువ పూడిక తీత పనులను సోమవారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు ఎన్.రాజశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలతో మాట్లాడుతూ వేతనాలు సక్రమంగా వస్తున్నాయా లేదా దినసరి వేతనం ఎంత వస్తున్నది, గ్రామంలో ఇంకా ఏమైనా పనులు కావాలనా అడిగి తెలుసుకున్నారు. కూలీలా హాజరును తనిఖీ చేసి, జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలిచారు. పనికి వచ్చే వారందరికీ వంద రోజులు పూర్తిచేయాలని, ఎస్సీ,ఎస్టీ, డిజేబుల్ పర్సన్స్ కుటుంబాలకు ఎక్కువగా పనికల్పించాలని, క్షేత్ర సహాయ సిబ్బందికి ఉపాధి కూలీలను పెంచి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. అలాగే గ్రామపంచాయతీలో పనికి రాకుండా ఉండేటువంటి కుటుంబాల వారికి సమావేశాలు నిర్వహించి పనికి వచ్చేటువంటి విధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్లస్టర్ సహాయ పతక సంచాలకులు బి.సుబ్రహ్మణ్యం, అదనపు కార్యక్రమ అధికారి చిన్న రెడ్డెమ్మ, సాంకేతిక సహాయకులు నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'ప్రజాదరణ చూసి ఓర్వలేకనే వైసీపీ విమర్శలు'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

సంపద సష్టించడం అభివద్ధి సాధించడం తెలుగుదేశం పార్టీకె సాధ్యమవుతుందని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సిఆర్.రాజన్, చిత్తూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి దగ్గు మళ్ల ప్రసాదరావు, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తెలిపారు. సోమవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ చేపట్టిన సూపర్6 పథకాలను అమలు పరచలేదని వైసిపి చేస్తున్న ఆరోపణలు అర్థం లేదన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉండడంతో పెన్షన్లను కూడా సక్రమంగా ఇవ్వలేక వైసిపి కాలయాపన చేస్తూ టిడిపిపై అపవాదులు వేస్తున్నారని అన్నారు. ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం పార్టీకి వస్తున్న జనఆదరణ చూసి వైసిపి నేతలు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. సురేంద్ర కుమార్, కోదండ యాదవ్, సప్తగిరి ప్రసాద్, మోహన్ రాజ్, సునీల్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

'ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి'



- సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రిటన్నింగ్ అధికారు పర్మిషన్ ఇచ్చిన వాహనాలను కూడా ఎఫ్ఎస్‌టి టీమ్ తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశంహల్‌లో జిల్లా ఎస్పీ, విఎన్.మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్యతో కలసి జిల్లాలోని రిటన్నింగ్ అధికారులు, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, విఎస్‌టి టీమ్స్ అధికారులు క్షేత్రస్థాయిలో నిర్వహించవలసిన బాధ్యతల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ రిటన్నింగ్ అధికారులు పర్మిషన్ ఇచ్చిన వాహనాలను కూడా తనిఖీ చేయాలని సంబందించిన టిమ్స్ అధికారులను ఆదేశించారు. ఈనెల 18న అభ్యర్థులు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని, అప్పటి నుండి మరింత బాధ్యతతో టిమ్స్ విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీలు చేయాలని, వాహనాల తనిఖీల్లో రూ.50వేలపై నగదు ఉంటే వాటికి సంబంధించి సరైన ఆధారాలుంటే విడిచి పెట్టాలని, సరైన ఆధారాలు లేకుండా అనుమానంగా ఉంటే ఇన్కమ్ టాక్స్ అధికారులకు పంపించాలన్నారు. వెంటనే ట్రెజరికి నగదు అందజేయాలని, సంబంధించిన వ్యక్తులకు తగిన రసీదు ఇవ్వాలన్నారు. ఓటర్లకు పంపిణీకి సంబందించి వివిధ రకాల బహుమతులు ఉంటే వాటికి సంబంది పేబిల్లు సక్రమంగా ఉందా లేదాని పరిశీలించి, సరిగా లేకుంటే సీజ్‌చేసి కేసు నమోదు చేయాలన్నారు. వాహనాల తనిఖీల చేసేటపుడు తప్పకుండా వీడియో కవరేజ్ చేయాలన్నారు. పోస్ట్ ఆఫీసులు, బ్యాంకులు నుండి ఇతర పోస్ట్ ఆఫీసులకు, బ్యాంకులకు నగదు పంపిస్తుంటే ముందుగానే సంబంధిత అధికారులు ఆర్ఓలకు సమాచారము ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించే రాజకీయపార్టీలు ముందుగానే సంబంధిత ఎస్‌హెచ్‌ఓలకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రచార సమయంలో బాణసంచాలు వంటివి ఉపయోగించరాదన్నారు, టీమ్స్ తనిఖీ సమయంలో నగదు, మద్యం వివిధరకాల ఆర్టికల్స్ సీజ్ చేసినప్పుడు వాటిని రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. తనిఖీ సమయంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా పరిశీలించాలని, ఏది కూడా సక్రమంగా పరిశీలించకుండా సీజ్ చేయరాదని సంబంధిత టీమ్స్ అధికారులను ఆదేశించారు. అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి టీమ్స్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు, వీడియో కవరేజ్, వెబ్ కాస్టింగ్ ఉంటుందని, దానికి సంబంధించి లింక్ జిల్లా ఎన్నికల అధికారికి, ఎస్పీ లింక్ అయి ఉంటుందని తెలిపారు. ఈనెల 18 నుండి బార్డర్ చెక్‌పోస్ట్‌లో అదనంగా సిబ్బందిని నియమించడం జరుగుతుందని తెలిపారు. ఏదైనాగాని సరైన ప్రూఫ్ ఆధారాలు లేకుంటేనే సీజ్ చేయాలన్నారు. ఇతర రకాల మద్యం, ఆర్టికల్స్ వంటి వస్తువులను ముందుగా సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్లో భద్రపరచాలన్నారు. జిల్లాలోని రిటర్నింగ్ అధికారులు, నోడల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నోడల్ అధికారులకు కేటాయించిన

విధులు బాధ్యతగా నిర్వహించాలి: కలెక్టర్



-ఎన్నికల నోడల్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నోడల్ ఆఫీసర్లకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశం హల్‌లో జిల్లా ఎస్పీ విఎన్.మణికంఠ చందోలు, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్యతో కలిసి 2024 సార్వత్రిక ఎన్నికల నిర్వహణ కోసం నియమించిన వివిధ రకాల టీమ్స్ నోడల్ అధికారులు నిర్వహిస్తున్న విధులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నోడల్ ఆఫీసర్లకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించాలన్నారు. గత నెల 16 ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుండి ఎన్నికల పూర్తి అయ్యేవరకు వివిధ రకాల టిమ్స్ నోడల్ అధికారు బాధ్యతగా విదులు నిర్వహించాలని సంబందితా నోడల్ అధికారులను ఆదేశించారు. ఈనెల 18న ఎన్నికల నోటిఫికేషన్ విధుల చేయడం జరుగుతుందని అప్పటి నుండి మరింత బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. టీమ్స్ రోజువారీ నివేదికల రిజిస్టర్లు నిర్వహణకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి సమీక్షించారు. సంబంధించిన టీమ్ అధికారులు వారు ఇప్పటివరకు నిర్వహించి విధులకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారికి వివరించారు. మీ టిమ్స్ సభ్యులు సహకారంతో ఎలాంటి పొరపాట్లు జరగకుండా విధులు నిర్వహించాలని, ఏరోజుకు సంబంధించిన నివేదికల రిపోర్ట్సను అదే రోజు సంబంధిత ఆర్ఓ ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి పంపించాలని సంబందితా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ రకాల టిమ్స్ నోడల్ ఆఫీసుర్లు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారంలో టిడిపి

ప్రజాశక్తి- ఐరాల

మండలంలో కొనసాగుతున్న తెలుగుదేశం పార్టీ ఇంటింటి ప్రచారంకు విశేష స్పందన లభించిందనిపూతలపట్టు టిడిపి, జనసేన, బిజేపి పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్ తెలిపారు. సోమవారం పొలకల పంచాయతీలో ఇంటింటి ప్రచారంకు వెళ్ళిన మురళిమోహన్‌కు మండల నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా మురళిమోహన్ ఉత్సాహంగా ఇంటింటి ప్రచారం కొనసాగించడం తెలుగుదేశం పార్టీ నాయకుల్లో, కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపింది. గ్రినింగ్ వర్క్‌ను స్వయంగా చేయడంతో పాటుగా అందరితో ఆప్యాయంగా పలకరిస్తూ టిడిపి 6 గ్యారంటీ పథకాల మ్యానిఫెస్టోను వివరిస్తూ, సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కరపత్రాలను పంచారు. చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్ రావు తనయుడు దగ్గుమళ్ల సుధాకర్, మండలఅధ్యక్షులు గిరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయం ప్రారంభం

తవణంపల్లె: మండలంలో నూతన తెలుగుదేశం పార్టీ కార్యాలయంను చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సిఆర్.రాజన్, మాజీ ఎమ్మెల్సీ రాజనరసింహులులతో కలిసి పూతలపట్టు ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్ సోమవారం ప్రారంభించారు. ముందుగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించిన రిబన్ కట్‌చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, చిత్తూరు పార్లమెంటు అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్ రావు తనయుడు సుధాకర్, మండల అధ్యక్షులు గాలి దిలీప్ కుమార్, జగదీశ్వర్ నాయుడు పాల్గొన్నారు.



పెట్టుబడులు రాకే నిరుద్యోగం

అమరనాథ్ రెడ్డి

ప్రజాశక్తి- వికోట

వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రానికి పెట్టుబడి రాకపోవడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగం పెరిగి యువత అల్లాడిపోతున్నారని మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రమైన రీపోర్టులో తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీల ఉమ్మడిగా తెలుగు యువత ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి పలమనేరు నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి అమర్నాథ్ రెడ్డి, చిత్తూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ గడచిన ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా మాటతప్పి.. మడమ తిప్పిన సీఎం జగన్మోహన్ రెడ్డికి రాబోయే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. యువత ఉత్సాహం చూస్తుంటే రానున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి విజయం తప్పదని చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. అనంతరం మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి కార్యకర్తలు టిడిపిలో చేరారు. అమర్నాథ్ రెడ్డి వారందరికీ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు, మండల అధ్యక్షుడు రంగనాథ్, ధీరజ్, శబరిష్, మైందుల రామచంద్రుడు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



- సమావేశంలో ప్రసంగిస్తున్న అమర్నాథ్ రెడ్డి

జిల్లాలో తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: జిల్లాలో తాగునీటి ఎద్దడి లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా పరిస్థితులపై సోమవారం వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుండి కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి సోమవారం మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి సమీక్ష నిర్వహించగా తిరుపతి కలెక్టరేట్ నుండి కలెక్టర్ ప్రవీణ్ కుమార్, తిరుపతి మునిసిపల్ కమిషనర్ అదితి సింగ్, సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో తాగు నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, ఉపాధి హామీ పనులు లక్ష్యం మేరకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తాగు నీటి సరఫరా ఇబ్బందులపై తిరుపతి నగర పాలక సంస్థ పరిధిలోని వాటికి కమాండ్ కంట్రోల్ రూం 0877-2256766 కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి రాజశేఖర్, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, ఎపిఎస్‌పిడీసీఎల్ ఎస్‌ఈ కృష్ణా రెడ్డి, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి విజయ కుమార్ పాల్గొన్నారు.


ఒలంపియాడ్ రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ప్రతిభ చూపిన మినర్వా పాఠశాల విద్యార్థులు

'మినర్వా' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఐఐటీ ఒలంపియాడ్‌లో రాష్ట్ర స్థాయి పరీక్షల్లో గూడూరు పట్టణంలోని మినర్వా పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రాం ప్రసాద్ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఐఐటీ ఒలంపియాడ్ లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించడం అభినందనీయం అన్నారు. అనంతరం గుంటూరులో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డులు, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించింది.


తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో యువశ్రీ మురళిని సత్కరిస్తున్న దృశ్యం

యువశ్రీ మురళికి ఉగాది సత్కారం

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: కవి, రచయిత, ఉపాధ్యాయులు యువశ్రీ మురళికి తిరుపతిలోని యూత్ హాస్టల్ సమావేశ మందిరంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనంలో కవిత పఠించినందుకు ఆ సంఘం అధ్యక్షులు సాకం నాగరాజ, గౌరవాధ్యక్షులు గార్లపాటి దామోదర నాయుడు శాలువాతో సత్కరించి పుస్తకం బహూకరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్, కార్యనిర్వాహక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు, శతావధాని ఆముదాల మురళి పాల్గొన్నారు.



ముక్కంటి అన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తొట్టంబేడు మండలం చిన్నకన్నలికి చెందిన భక్తుడు కిలారి శ్రీనివాసులు నాయుడు భక్తుడు సోమవారం రూ.1,01,116లు విరాళంగా అందించారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఈ విరాళం స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలిపి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందించారు.

ముదిరాజ్‌ల కలను నెరవేర్చండి: రమణయ్య


మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు వైవి రమణయ్య

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ముదిరాజ్ లు అన్ని రంగాలలో వెనుకబడే ఉన్నారని, ముదిరాజ్ లకు రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ అధ్యక్షులు వైవి రమణయ్య డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 26 లక్షలకు పైగా జనాభా కలిగి ఉన్నామని, శ్రీకాళహస్తి సత్యవేడు నియోజకవర్గాల్లో లక్షకు పైగా జనాభా కలిగి ఉన్నామన్నారు. ముదిరాజ్ లను కేవలం ఓటర్లుగానే వాడుకుంటున్నారని, వారి సంక్షేమాన్ని విస్మరించడం సబబు కాదన్నారు. బిసి డి లో ఉన్న ముదిరాజ్ లను బీసీ ఎ కు మార్చి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గత 40 సంవత్సరాలుగా ముదిరాజ్ ల భవనం కోసం ఎదురు చూస్తున్నామని, తమ సామాజిక వర్గానికి శ్రీకాళహస్తి, తిరుపతి నగరంలో రెండు ఎకరాల స్థలం కేటాయించి భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ముదిరాజ్ యువత అధ్యక్షులు ఆకుల గురుమూర్తి, వెంకటేశ్వర్లు గురుమూర్తి, గోవిందస్వామి పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపాల్టీ 19వ వార్డుకు చెందిన టిడిపి కార్యకర్త సుబ్రహ్మణ్యం గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ అక్కడికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించి భౌతికకాయం వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉమాశంకర్ రెడ్డి మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడండి..

అధికారులకు మున్సిపల్ కమిషనర్ ఆదేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో వేసవి తీవ్రత దృష్ట్యా తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని మున్సిపల్ కమిషనర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విఆర్ఓ మున్సిపల్ ఇంజనీరింగ్, అసిస్టెంట్ ఇంజనీరింగ్, వార్డు అమెనిటీస్, సెక్రటరీ, ఫీల్డ్ సిబ్బందితో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ యాక్షన్ ప్లానింగ్ తయారు చేసి నీటి ఎద్దడి ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున పాదచారులకు, వాహన చోదకులకు తాగునీటికి ఎలాంటి అసౌకర్యం లేకుండా పట్టణంలో ఐదు ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి తాగునీటి కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, వార్డు సెక్రటరీలు, ఫీల్డ్ స్టాఫ్ పాల్గొన్నారు.


తాగునీటి సమస్యపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ రెడ్డి

విద్యార్థి దశ నుంచే లక్ష్యం అవసరం

- మోటివేటర్ చెన్నూరు కృష్ణారావు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: 'విద్యార్థి దశ నుంచే లక్ష్యం అవసరమని మిమ్మల్ని మీరు విశ్వసించేలా చేసి ఎలాంటి ప్రలోభాలు, ఆవేశానికి లోనుకాకుంటే అనుకున్నవి సాధించవచ్చు..' అని హైదరాబాదుకు చెందిన మోటివేటర్ చెన్నూరు కృష్ణా రావు అన్నారు. పట్టణంలోని ది స్కూల్ లో సోమవారం 6 నుంచి 9వ తరగతి విద్యార్థులను చైతన్య పరిచే కార్యక్రమంను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ జీవితంలో అనుకున్నవి సాధించి మిగతా వారికి ఆదర్శంగా నిలవాలన్నారు. 'నిన్ను గొప్ప వారిగా చేయాలనే తపన తల్లి దండ్రులకు, గురువుకు మాత్రమే ఉంటుంది' అన్నారు. అన్నిటికీ ఓర్పు ముఖ్యమన్నారు. ఓటమితో వచ్చే నిరాశ నుంచి అవకాశాలు వెతకాలన్నారు. మీరు అభ్యసించే భాష ఏదైనా దానిపై పట్టు సాధిస్తేనే మీకు విజయానికి దారి సులభం అవుతుంది' అని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆయనను స్కూల్ యాజమాన్యం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ జనార్దన్ రావు జె పవార్, ప్రధానోపాధ్యాయురాలు పి విశాల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మోటివేటర్ చెన్నూరి కృష్ణారావు

'ఆరోగ్యమే మహాభాగ్యం'

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 'ఆరోగ్యమే మహాభాగ్యం' అని డాక్టర్ ధనుష్ పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి ఎస్వీ రాఘవేంద్ర ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ఆరోగ్యం పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి ధనుష్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని ఆరోగ్యానికి మించిన సంపద లేదని 40 సంవత్సరాలు పై బడిన వారందరూ చిన్న చిన్న ఆరోగ్య పరీక్షలు చేసుకోవడం వల్ల ముందస్తు ఆరోగ్య సమస్యలను గుర్తించుకోవచ్చన్నారు. వాటి చికిత్స అందించడం ద్వారా ప్రాథమిక దశలోనే జబ్బులను అరికట్టవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నడక అదుపులో ఉంచుకోవాలని దీర్ఘకాలిక జబ్బులు బిపి, మధుమేహం ఉన్నవారు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుతో సోదర భావం పెంపు

పులివర్తి నాని

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): ఇఫ్తార్ విందు సోదర భావాన్ని పెంపొందిస్తాయని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. సోమవారం చంద్రగిరి బీడీ కాలనీలోని రోషన్ మసీద్ లో ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ముస్లిం సోదరుల ఆత్మీయ ఇఫ్తార్ విందును స్వీకరించారు. ఇఫ్తార్ కు హాజరైన పులివర్తి నానిని ముస్లిం మతపెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు లోక కళ్యాణార్థం అత్యంత భక్తి శ్రద్ధలతో నెల రోజులు ఉపవాసం పాటిస్తారని సమాజంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకుంటారని తెలిపారు. నెలరోజుల ఉపవాస దీక్షలో అనేక సత్ప్రయోజనాలు కలుగుతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం కుటుంబాలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

వైసిపి నాయకుల ప్రచారం


ప్రజాశక్తి - బాలాయపల్లి : మండలంలోని పిగిలాం పంచాయతీ కొత్తపాలెం,పాకపూడి పంచాయతీ లోవైసిపి నాయకులు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వైసిపి నాయకులు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందాలన్నా, బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలన్నా వైస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. వెంకటగిరి నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి ఎం గురుమూర్తి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు వేమూరు వెంకటరమణారెడ్డి, రంగనాథం, వైసిపి సీనియర్ నాయకులు గుండుబోయిన గోపాల్ యాదవ్, మల్లెల వెంకటేశ్వర్ల పాల్గొన్నారు.

గడ్డి వామి దగ్ధం

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామ పంచాయతీ రైతు ఆకుపల్లి సురేష్‌కు చెందిన గడ్డివామి (120 మోపులు) గుర్తు తెలియని వ్యక్తుల వల్ల పూర్తిగా దగ్ధమైంది. దీంతో బాధిత రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చెంది తమను ఆదుకోవాలని అధికారులను కోరాడు.

మల్లాంలో ఉగాది మహోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-చిట్టమూరు: 'ఉగాది' పేరు చెప్పగానే ముందుగా గుర్తుకు వచ్చేది అది మన తెలుగు పండుగ.. ఉగాది నుండే తెలుగు సంవత్సరం మొదలవుతుంది.. ఇది తెలుగువారి మొదటి పండుగ. ఇంతటి గొప్ప పండుగ ఉగాది నాడు మల్లాంలో వేంచేసి ఉన్న తొమ్మిది మంది దేవతామూర్తులకు ఒకేసారి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్టు మల్లాం శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ స్వయంభువు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిక్షేత్ర ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చిల్లకూరు సాయికుమార్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది మహోత్సవ వేడుకలు గత మూడు సంవత్సరాలుగా దేశంలో ఎక్కడా లేనివిధంగా మల్లాం గ్రామంలో జరుగుతున్నాయని తెలిపారు. భక్తులకు ఒకేసారి తొమ్మిది మంది దేవతామూర్తులను దర్శించుకునే అవకాశం అతి అరుదుగా లభిస్తుంది. ఈ అవకాశాన్ని భక్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉగాది మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా, ప్రత్యేక పుష్పాలంకరణలతో, బాణాసంచా వేడుకలతో, మంగళ వాయిద్యాలతో, వినోద కార్యక్రమాలతో, భక్తులకు తొమ్మిది రకాల ప్రసాదాలను పంచుకుంటూ తొమ్మిది మంది దేవతామూర్తులు భక్తులకు దర్శనం కల్పిస్తారన్నారు. ఉగాది



మంగళవారం అకావడంతో ఆ రోజు క్షేత్రంలో స్వామికి పాలు, పంచామృత అభిషేకాలు భక్తుల రద్దీ దృష్ట్యా రద్దు చేశామని తెలిపారు. భక్తులు ఈ విషయాలు గమనించాలని ఆలయ కమిటీ చైర్మన్ చిల్లకూరు సాయి కుమార్ రెడ్డి తెలిపారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా...

- పూతలపట్టు పోలీస్ స్టేషన్ పరిధిలో 250 మంది గుర్తింపు - ప్రతి ఆదివారం కౌన్సెలింగ్

ప్రజాశక్తి- పూతలపట్టు: ఎన్నికల నేపథ్యంలో రౌడీ షీటర్ల పై పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎన్నికల సంఘం పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు అందులో క్రియాశీలకంగా ఉన్నవారు ప్రస్తుతం వారు చేస్తున్న పనులు కుటుంబ జీవనం నివాస ప్రాంతాలు, తదితర అంశాలపై సమగ్ర వివరాలు సేకరించి వారికి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. ఎన్నికల ప్రచార ఇతర ప్రక్రియల్లో హడావుడి చేయడం ఓటర్లను ప్రభావితం చేయడానికి ప్రయత్నించడం భయాందోళనలు రేకెత్తించేలా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడితే వారిపై కఠినచర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

నిఘా ఇలా...

గత స్థానిక సంస్థ గత ఎన్నికల్లో ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసేలా ప్రవర్తించిన వారిని, నిత్యం గొడవలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చేవారిని, ఓటర్లను బెదిరింపులకు గురిచేసే వారిపై పోలీసులు ప్రత్యేకంగా పెట్టారు. సమాచారం ద్వారా వీరిని పోలీస్ స్టేషన్కు రప్పించి తీరుమార్చుకోవాలని హెచ్చరిస్తున్నారు. హెచ్చరికలతోపాటు నిత్యం కొంతమందిని తహశీల్దార్ ముందు బైండ్ ఓవర్ చేస్తున్నారు.

ప్రజాప్రతినిధుల అవసరాల కోసం

కొందరి ప్రజాప్రతినిధుల రాజకీయ అవసరాలకు పలువురు రౌడీషీటర్లను ప్రోత్సహిస్తున్నారు. వీరి మద్దతుతో వారు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇందులో కొందరు కౌన్సిలింగ్లకు సైతం రాకపోవడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ తరహా లోపాలను అధిగమించి ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తమ విధులను పక్కాగా నిర్వహించాల్సిన అవసరం ఉంది.



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

172 మందిని బైండోవర్ చేశాం
- సుదర్శన ప్రసాద్, పూతలపట్టు సీఐ



రౌడీ షీటర్లు కచ్చితంగా తమ తీరు మార్చుకోవాలి. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకొని ప్రజలను ఇబ్బంది పెట్టేలా ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవు. ఒకసారి ఎన్నికల కేసుల్లో నమోదైతే ప్రతి ఎన్నికల సమయంలోనూ వారి వివరాలు తెరమీదకి వస్తూనే ఉంటాయి. ఇప్పటికే 172 మందిని బైండోవర్ చేశాం. మిగిలిన వారిని కూడా కొద్ది రోజుల్లో పూర్తి చేస్తాం. ప్రతి ఆదివారం కొంతమందిని స్టేషన్కు రప్పించి కౌన్సిలింగ్ ఇచ్చి వారి వద్ద నుంచి సంతకాలు పెట్టించుకుంటున్నాం వారు తీరు వ్యవహార శైలిపై నిగా కొనసాగిస్తాం.



వాటర్ బెల్ సమయంలో నీరు తాగుతున్న విద్యార్థులు

పాఠశాలల్లో వాటర్ బెల్

ప్రజాశక్తి- సోమల: వేసవి ఎండల తీవ్రత కారణంగా పాఠశాలల్లో చదివే విద్యార్థులు డిహైడ్రేషన్‌కు గురికాకుండా పాఠశాలలో వాటర్ బెల్ సమయంలో విద్యార్థులందరి వద్ద నీరు తాగించే కార్యక్రమాన్ని సోమవారం మండలంలో ప్రారంభించారు. విద్యాశాఖ ఆదేశానుసారం ప్రతిరోజు పాఠశాల నిర్వహణ సమయంలో 8.45 గంటలకు ఒకసారి, 10.5 గంటలకు రెండవసారి, 11.50గంటలకు మూడోసారి విద్యార్థుల చేత నీటిని తాగించడం చేయి స్తున్నారు. ఒంటిపూట బడులు కావడంతో విద్యార్థులకు తాగునీటివి శరీరానికి అధికంగా అందించేందుకు ఈచర్యలు తీసుకుంటున్నట్లు పాఠశాల నిర్వాహకులు తెలిపారు.

ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: స్థానిక కమ్మనపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం ప్రిన్సిపల్ అధ్యక్షతన విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం జరిగింది. జిల్లా వైద్యాధికారులు డాక్టర్ శిరిష, ఆర్‌బిఎస్‌కె జిల్లా నోడల్ అధికారి గుణశేఖర్, జిల్లా ఆరోగ్యవిద్య విస్తరణ అధికారి జయరాముడు ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థినులు ఆరోగ్యం పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తను వివరించారు. బాలికలు బహిష్టు సమయంలో పాటించాల్సిన శుభ్రత, ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్‌టచ్, బాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ చందర్, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న
అడిషనల్ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటప్రసాద్

పిహెచ్‌సిల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: రోజురోజుకు ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో స్థానిక పీహెచ్సీలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎక్కువగా అందుబాటులో పెట్టాలని అడిషనల్ డిఎంఅండ్ హెచ్‌వో వెంకటప్రసాద్ వైద్యసిబ్బందికి ఆదేశించారు. జిడి నెల్లూరు పిహెచ్‌సిని సోమవారం అడిషనల్ డిఎంఅండ్ హెచ్‌వో తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సిలో పరిధిలో టీబీ వ్యాధిగ్రస్తులు ఇప్పటివరకు ఎంతమంది ఉన్నారు, ఎంతమంది వ్యాధిగ్రస్తులను గుర్తించి మందులు, మాత్రలను పంపిణీ చేస్తున్నారు, కొత్తగా టీబీ వ్యాధిగ్రస్తులను ఎవరినైనా గుర్తించారా అని వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎండతీవ్రత కారణంగా వడదెబ్బకు గురయ్యే వారి రోగుల సంఖ్య పెరగవచ్చు అని, అదనుగుణంగా సెలైన్లు మందులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, సిహెచ్‌వో శ్రీనివాసులు, ఫార్మసిస్ట్ నాగలక్ష్మి, సూపర్వైజర్ ధర్మేంద్ర, డిపిఎంవో రవి, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంకు ఘనస్వాగతం

ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట సర్కిల్లో డిప్యూటీ సీఎం నారాయణ స్వామికి క్రేన్ ద్వారా భారీ గజమాలతో వైసీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. సోమవారం మండలంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్ని డిప్యూటీ సిఎంకు అరగంటపాటు రెండు టన్నుల పువ్వులతో పూలవర్షం కురిపించారు.

వైసీపీ వైఫల్యాలను ఎండగట్టండి: టిడిపి

ప్రజాశక్తి - రామకుప్పం: వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను టీడీపీ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా ఎండగట్టాలని టిడిపి రామకుప్పం మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, బీసీసెల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్ కోరారు. సోమవారం రామకుప్పంలో ఐటిడిపి సమావేశంలో వారు మాట్లాడుతూ... వైసీపీ పాలనలో అవినీతిని ప్రజలకు తెలియజేయడంతో పాటు టిడిపి కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌తో పాటు ఇతర వర్గాలకు అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. నియోజకవర్గ ఐటీడీపీ ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్, శరవణ కుమార్, అరుణ్, రవికుమార్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి క్యూ కట్టిన యువత

చౌడేపల్లె: మండలంలోని చారాల పంచాయతీలోని వైఎస్ఆర్సిపి నాయకులు, యువత భారీగా తెలుగుదేశం పార్టీలో చేరారు. పుంగనూరు నియోజకవర్గం ఉమ్మడి పార్టీల అభ్యర్థి చల్లా రామచంద్రా రెడ్డి సమక్షంలో మండలం టిడిపి అధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, ప్రదీప్ రాజు, గిరిరాజు, విజయ్ భాస్కర్‌రెడ్డి, బాబునాయుడు, పద్మీరెడ్డి అధ్యక్షతన సోమవారం సుమారు 100 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి చల్లా బాబు సాదరంగా ఆహ్వానించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : స్థానిక జయరామరావు వీధిలోని శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ, ప్రైమరీ స్కూల్ విద్యార్థులను ఎగువ తరగతులకు పంపారు. ఎంఈవో భువనేశ్వరి, తిరుమల ఆసుపత్రి అధినేత వెంకట శేషా రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులకు ఉగాది, తెలుగు సాంప్రదాయాల గూర్చి వివరించారు. ఏజీఎం సురేష్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్ పాల్గొన్నారు.

130 మంది వలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి- సోమల: సోమల మండలంలో ఈనెల 6, 8వ తేదీల్లో వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతూ వస్తున్నాయి. వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేస్తున్నట్లు వలంటీర్లు తమ రాజీనామా పత్రంలో పేర్కొంటున్నారు. కాగా మండలంలో ఇప్పటివరకు 130 మంది వలంటీర్లు రాజీనామాలు చేసి సంబంధిత పత్రాన్ని ఆయా పంచాయతీల కార్యదర్శులకు అందజేసినట్లు సమాచారం. ఒకవైపు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండలంలో సుడిగాలి పర్యటన చేస్తున్న సందర్భంలో వలంటీర్ల రాజీనామా పర్వం కొనసాగింది.

23 మంది మూకుమ్మడి రాజీనామా

నగరి నియోజకవర్గం నింద్ర మండల కేంద్రమైన నింద్ర సచివాలయానికి చెందిన 20మంది వలంటీర్లు, విజయపురం మండలం పాతార్కాడుకు చెందిన ముగ్గురు వలంటీర్లు సోమవారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. నింద్ర సచివాలయ పరిధికి చెందిన 20మంది వలంటీర్లు వారి రాజీనామా పత్రాలను ఎంపిడీవో భవానికి అందజేయగా, పాతార్కాడుకు చెందిన వలంటీర్లు ఎవో రమణప్రకాష్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

160 మంది వలంటీర్లు

రామకుప్పం: మండల పరిధిలోని పనిచేస్తున్న 160మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపిడీఓ ఈశ్వరన్‌కు సోమవారం అందించారు. రామకుప్పం మండల ప్రజాపరిషత్‌లో మండలానికి చెందిన 160 మంది వలంటీర్లు రాజీనామా చేశారు.



బైరెడ్డిపల్లిలో రాజీనామాలు సమర్పించిన వలంటీర్లు

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బైరెడ్డిపల్లి పంచాయతీకి చెందిన 36 మంది వలంటీర్లు సోమవారం స్థానిక ఎంపీడీవోకి తమ రాజీనామా పత్రాలను అందజేశారు.

వైసిపిలోకి చేరికలు

ప్రజాశక్తి- గంగవరం: మండలంలోని గండ్రాజుపల్లి పంచాయతీ జంగాలపల్లి గ్రామానికి చెందిన రవి, ఆగస్తి, ఈశ్వర్, భాస్కర్‌తోపాటు గ్రామస్తులు ఎమ్మెల్యే వెంకటే గౌడ సమక్షంలో వైసిపిలో చేరారు. వీరికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో జరగ బోవు ఎన్నిక ల్లో వైసీపీ విజయానికి కృషి చేయాలని కోరారు.



వైసిపిలో చేరిన జంగాలపల్లి గ్రామస్తులు

వికోటలో ట్రాఫిక్ గోల

మహా నగరాలను తలపించిన మండల కేంద్రం

ప్రజాశక్తి- వికోట: పెద్దపెద్ద మహానగరాలలో ట్రాఫిక్ స్తంభించి గంటల తరబడి ప్రయాణికులు అవస్థలు పడుతుంటారు. అయితే అదే పరిస్థితులు మండల కేంద్రమైన వి.కోటలో సోమవారం చోటుచేసుకుంది. తెలుగువారి నూతన సంవత్సరం ఉగాది పండుగ, ముస్లింల పవిత్ర పండగ రంజాన్ వెంటవెంటనే రావడంతో వివిధ రకాల వస్తువుల కొనుగోలుకు ప్రజలు మండల కేంద్రమైన వికోటకు తరలివచ్చారు. సోమవారం వాహనాల రాకపోకలు అధికమై రద్దీ పెరగడంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించి వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కిరాణా, వస్త్ర దుకాణాలతో పాటు పూలు, కూరగాయలు, పూజాసామాగ్రి దుకాణాల వద్ద ప్రజలు కిక్కిరిసిపోయారు. లాంగ్ బజార్‌లోని ప్రధాన రహదారిపై దుకాణాలు ఎదుట ద్విచక్ర వాహనాలు, కార్లు పార్క్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా అంబేద్కర్ కూడలిలో వాహనాలు రద్దీ ఎక్కువ్వడంతో ట్రాఫిక్ స్తంభించిపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు నానా తిప్పలుపడ్డారు. ఇదే అదనుగా వ్యాపారులు అన్ని రకాల వస్తువులను అధిక ధరలకు విక్రయించడంతో వినియోగదారులు అవస్థలు పడ్డారు.



'ధర' దడ


- ఏం (తినేటట్లు) కొనేటట్లు లేదు..!
- నిత్యావసరాల ధరలు పైపైకి
- పెరిగిన ధరలు
- ఆందోళనలో ప్రజలు

ఏం కొనేటట్లు లేదు.. ఏం తినేటట్లు లేదు.. వంటింటి నూనె ప్యాకెట్ నుంచి మొదలు నిత్యావసర ధరలన్నీ ఆకాశాన్నంటుతున్నాయి. కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకి సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి.

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో ఏం తినేటట్లు లేదు.. ఏం కొనేటట్లు లేదు.. అనే విధంగా మారింది పేద, మధ్యతరగతి ప్రజల పరిస్థితి. అసలే ఉప్పులు, పప్పుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే పండగల పుణ్యమా అని ఇంకి పైకి పోతున్నాయి ధరలు.. పెరిగిన ధరలో ప్రజలకు పగలే చుక్కలు కనిపిస్తున్నాయి. రూ.500లు ఖర్చుపెట్టిని కూరగాయల సంచి నిండే పరిస్థితి లేదు..

ఇక పోపుసామాన్లు, పప్పులు, నూనెలు, ఇంటి అవసరాల సరుకుల విషయానికొస్తే అదోపెద్ద భారం. సాధారణంగా మధ్యతరగతి, పేద ప్రజలు నెలకి సరిపడా కిరాణా సరుకులు, బియ్యం కొనుగోలు చేస్తుంటారు. ఇందుకుగాను రూ.5 నుంచి 6వేలు వరకు ఖర్చు చేయాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం పై వెచ్చిన మొత్తం వెచ్చించి సరుకులు కొన్నా నెల పూర్తికాక ముందే సరుకులు నిండుకుంటున్నాయి.

సన్నబియ్యం ధర అమాంతం పెరిగింది. మూడు నెలల క్రితం 25 కేజీల సోనామసూరి ఓ మోస్తరు రకం రూ.1000 నుంచి 1100లు ఉంటే అదే బియ్యం నేడు రూ.1400 నుంచి 1600లకు చేరింది. రెండుమూడు నెలల వ్యవధిలోనే బియ్యం ధరలు అమాంతం పెరిగిపోయాయి. కూరగాయల విషయానికొస్తే ఒక్క ఎర్రగడ్డలు మినహా అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు ధరలు పెరిగాయి. వారం రోజుల క్రితం అరకిలో రూ.20లు ఉన్న కూరగాయలు పండుగ నేపథ్యంలో రూ.30కి చేరాయి. బీన్స్, క్యారెట్ వంటి కూరగాయలైతే పావు కిలో రూ.25ల వరకు పులుకుతున్నాయి. వంకాయ, బెండ, బీర, దొండ, సొర వంటివి సాధారణ ధరల కంటే రూ.5 నుంచి రూ.10ల వరకు పెరిగాయి. ఆకు కూరలు ఒక కట్ట రూ.20నుంచి 25ల వరకు పెరిగింది. టమోటా సీజనల్ కావడంలో ధర తక్కువగానే ఉంటోంది. ఇక వంటనూనెల మంట పెరుగుతూనే ఉంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటర్ రూ.120, వేరుశనగ నూనె లీటర్ రూ.150లుగా ఉంది.



ఉప్పు కొన్నాలన్నా తిప్పులు తప్పడం లేదు. అయోడిన్, మేలు రకం అంటూ కిలో ఉప్పు ప్యాకెట్‌కు రూ.38లు పెట్టాల్సిందే. కందిపప్పు కిలో రూ.150 ఇతర రకాల పప్పు దినుసులు కిలో వందకు పైమాటే.... ఓ వైపు ఎన్నికల వేడి, పెరిగిన ఉష్ణోగ్రతలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే. మార్కెట్‌లో పెరిగిన నిత్యావసరాలు సామాన్య, మధ్యతరగతి ప్రజలక పగలే చుక్కలు చూపెడుతున్నాయి.

ఉగాది తెలుగువారి మొదటి పండుగ. ఉగాది రోజున పిండివంటలు చేద్దామన్నా పెరిగిన వంటనూనెలు, పప్పు దినుసుల ధరలు పేదలకు ఆర్థిక భారంగా మారుతోంది. ఏమందిలే అనుకొని కాస్తా బెల్లం, మామిడి, పెరట్లో లభించే వేపపువ్వుతో ఉగాది పచ్చడి చేసుకొని సర్దుకోవాల్సిందే. ధరలను నియంత్రిస్తామంటూ ఎన్నికల మందుకు రాజకీయ పార్టీల నేతల మాటలు ఎన్నికలకు మాత్రమే పరిమితమౌతున్నాయి. ఈ ఏడాది ఉగాది ఎన్నికల ఉగాది అధికార, ప్రతిపక్షం ఢీ అంటూ ఢీ అన్నట్లుగా ఎన్నికల ప్రచారంతో హోరెత్తిస్తోన్నాయి. నిత్యావసర వస్తువుల నియత్రణపై కాస్త దృష్టిపెట్టాలని, నిత్యావసర వస్తువుల ధరలు పేదలకు అందుబాటులో ఉండేలా చూస్తామన హామీ ఇవ్వడంతో పాటు ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చాలని పేద, మధ్యతరగతి కోరుతున్నారు. తీపి, పులుపు, చేదుతో కూడిన ఉగాది పచ్చడి ఈ ఏడాది ఉగాది పెరిగిన నిత్యావసరాలతో పేద, మధ్యతరగతికి చేదును మాత్రమే పంచుతోంది.

స్పందన భవనాన్ని పరిశీలించిన కలెక్టర్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 2024 ఎన్నికలకు సంబంధించి జిల్లా కలెక్టరేట్‌లోని కొత్త స్పందన హాల్‌లో ఏర్పాటు చేసిన ఎలక్షన్ కంట్రోల్ రూమ్‌ను సోమవారం మధ్యాహ్నం జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్యతో కలసి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన వివిధ రకాల టీమ్స్ నోడల్ అధికారులతో పాటుగా వారికి కేటాయించిన సిబ్బంది ఎలక్షన్ కంట్రోల్ రూమ్ నందు 24/7 షిఫ్టుల వారీగా విధులు నిర్వహించాలని సంబంధిత నోడల్ ఆఫీసర్లను ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుండి మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ అములులోకి వచ్చిందని, ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి టీమ్స్‌కు సంబంధించి ఇప్పటి వరకు అన్ని రకాల రిపోర్ట్స్ ను సిద్ధంగా ఉంచుకోవలన్నారు. అంతకు ముందు వివిధ టీమ్ నోడల్ అధికారుల వారీగా ఏర్పాటు చేసినకున్న కంప్యూటర్స్ సిస్టమ్స్‌ను పరిశీలించి ఇంకా ఎవరైనా ఏర్పాటు చేసుకోకుంటే వెంటనే ఏర్పాటు చేసుకోవాలని నోడల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్, జేసి, డిఆర్ఓ కంట్రోల్ రూమ్‌ను అపుడుప్పుడు తనిఖీ చేయడం జరుగుతుందని, ఆ సమయంలో డ్యూటీలో ఉండవలసిన అధికారి లేదా సిబ్బంది డ్యూటీలో లేకుంటే వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. హాల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ పరిశీలించారు.

9న శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం



ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 9వ తేదీన శ్రీక్రోధినామ సంవత్సర ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా జరుగనుంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ముందుగా ఉదయం 3 గంటలకు సుప్రభాతం, నిర్వహించి అనంతరం శుద్ధి నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి వారికి మరియు విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేస్తారు. ఉదయం 7 నుండి 9 గంటల నడుమ విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశిస్తారు. ఆ తరువాత శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపచేస్తారు. అనంతరం పంచాగ శ్రవణం నిర్వహిస్తారు. ఉగాది ఆస్థానాన్ని బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని 9వ తేదీన శ్రీవారి ఆలయంలో నిర్వహించే ఆర్జితసేవలైన అష్టదళ పాదపద్మారాధన, కళ్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవాలను టీటీడీ రద్దు చేసింది.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : రాకేష్‌రెడ్డి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ ఎంఎల్ఏ అభ్యర్థి పోచారం రాకేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో ఆయన స్వగృహంలో సమావేశం నిర్వహించారు. బిజెపి వ్యతిరేక విధానాలకు స్వస్తి చెప్పాలని, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలన పోవాలన్నా కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం ప్రత్యేక హోదా ప్రకటిస్తారన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త రాబోయే ఎలక్షన్లలో కష్టపడి పనిచేయాలని కోరారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమన్నారు. ఈనెల 20వ తేదీ నుండి పుత్తూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామన్నారు. పుత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కేశవులు, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ లోహితరాజు, గోపి రాయల్, భాగ్యరాజ్, సుధాకర్, అంబేద్కర్, ప్రకాష్ పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి పోచారం రాకేష్ రెడ్డి

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శివశంకర్ ఆధ్వర్యంలో
ఇఫ్తార్ విందు



ప్రజాశక్తి- పలమనేరు: స్థానిక మదనపల్లి రోడ్డులోని ఎవిసి కన్వెన్షన్ హాల్లో సోమవారం సాయంత్రం 6 గంటలకు పలమనేరు నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బివిఎం శివశంకర ఆధ్వర్యంలో దాదాపు 1000 మంది ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో శివశంకర్ మాట్లాడుతూ గత పాలకుల ఆధ్వర్యంలో పలమనేరు అంతగా అభివృద్ధి చెందలేదని తనకు ఒక అవకాశం ఇస్తే పలమనేరును అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. అలాగే ముస్లిం మైనార్టీ సోదరులకు అన్నిరకాల సహాయ సహకారాలు అందించి వారు అభివృద్ధికి తోడ్పడుతానని తెలిపారు.

అన్నదానం

పలమనేరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బీబీఎం శివశంకర ఆధ్వర్యంలో సోమవారం ఉదయం స్థానిక శివాలయంలో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బంగారుపాళ్యం: మండలంలోని ముస్లిం సోదరులకు రంజాన్ పుష్కరించుకుని ఇఫ్తార్ విందును చేపట్టారు. తెలుగుదేశం పార్లమెంట్ అభ్యర్థి దుగ్గిరాల ప్రసాద్, మండల అధ్యక్షులు జయప్రకాష్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ జయచంద్ర నాయుడు, ముస్లిం సోదరులు రహమతుల్లా జాకీర్ నాసిర్ పాల్గొన్నారు.